## 157. మృత్యు దేవత

ఓ నగర ద్వారపాలకుడికి అర్ధరాత్రి నగరంలోకి వెళ్ళే ఓ నల్లటి స్త్రీ కనిపించింది.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించాడామెని.

"నేను మృత్యు దేవతని. రేపు ఉదయం మీ ఊళ్ళోని వంద మంది మరణించబోతున్నారు. వాళ్ళ ప్రాణాలని తీసుకెళ్ళడానికి వచ్చాను." జవాబు చెప్పింది మృత్యుదేవత.

వెంటనే అతను నగరంలోకి పరుగెత్తికెళ్ళి ఈ విషయం పౌరులందరికీ చెప్పి అందర్నీ జాగ్రత్తగా ఉండమన్నాడు. నగరంలో మర్నాడు ఉదయం వెయ్యి మంది దాకా మరణించారు. వాళ్ళ ప్రాణాలని తీసుకెళ్తున్న మృత్యుదేవత మళ్ళీ నగర ద్వార పాలకుడికి తారసపడింది.

"ఇదేమిటి? నిన్న రాత్రి నువ్వు వంద మంది ప్రాణాలనే తీసుకెళ్తానన్నావు. కాని నిజానికి మరణించింది వెయ్యి మంది. ఎందుకు అబద్ధం చెప్పావు?" ప్రశ్నించాడు అతను.

"నేను చెప్పిందాంట్లో అబద్ధం లేదు. నేను వచ్చింది వంద మంది కోసమే. మిగిలిన తొమ్మిది వందల మందీ భయంతో మరణించారు." జవాబు చెప్పింది మృత్యు దేవత.

## 158. చెడ్డ ఊరు-మంచి ఊరు

న్యూయార్క్‌కి చెందిన ఓ లాయర్ ఓ కేసు పనిమీద షుగర్ లేండ్‌కి వెళ్ళాడు. క్లయింట్ అతని హోటల్ రూంకి వచ్చి లాయర్‌ని ఎక్కించుకుని కారులో కోర్టుకి తీసుకువెళ్తూ, దారిలోని ఓ చర్చి దగ్గర ఆగి కేసు గెలవాలని ప్రార్థించాడు. చర్చిలోకి వెళ్తూ క్లయింట్ కారుని లాక్ చేయకపోవడం గమనించిన లాయర్ అడిగాడు.